# (నూ)రూకలిస్తాను మేకలు కాస్తావా?

ఇదేఁవిటి? ఎండా? నిప్పా?

సూర్యుడు తగలబడిపోతున్నాడా?

పోతే పోనీ. పీడా వదిలిపోతుంది.

"కొంతమందికి అన్నీ ఉన్నా సుఖపడే యోగం ఉండదురా. ఆ జాతకాలు అంతే" అనేవారు మా నాన్న. అప్పుడది చాదస్తంగా కనిపించినా ఇప్పుడు నిజమేననిపిస్తోంది.

ఉద్యోగం మంచిదే. అయితే ఏం, ఎ.సి.లు, ఎయిర్ కూలర్లు లేకపోయినా, కనీసం నీడ పట్టున కూర్చునే యోగం కూడా లేదు నాకు.

ముక్కూ, మొహం తెలీని ముండా కొడుకు లందరికీ లక్షలు, కోట్లు అప్పులివ్వడం, సంవత్సరం చివర్న "పట్రండి, పట్రండి" అని మమ్మల్ని తోలడం.

అప్పుతీసుకున్నవాడికి తీర్చాలని తెలీదా?

ఎందుకు తెలీదూ. తెలుసూ.

తీర్చడానికి మనసొప్పదు.

వాడు తీర్చడని తెలిసీ, మేము వాడి చుట్టూ వెర్రి వెధవల్లాగా తిరగటం, మేము వస్తున్నట్టు వాడికి ముందే ఉప్పంది వాడు తాళం వేసుకొని వెళ్ళిపోవటం.

వీడెవడో కృష్ణమూర్తిట.

మధురలో ఉన్నాడా? ద్వారకలో ఉన్నాడా?

రెండోజుల్నుండి వెతుకుతున్నాం.

నాయనా! కృష్ణా! కనిపించి కరుణించు తండ్రీ!

ఎండకి ముక్కులోంచి ఆవిరి వస్తోంది.

కళ్లల్లో నిప్పులు పెట్టినట్టుంది.

మేనేజరు మీది కోపంతో గుండెలో గాడిపొయ్యి మండిపోతోంది.

ఈ వేడికి బుర్ర పిచ్చెక్కిపోతుందో ఏంవిటో!

అదే మంచిది.

అప్పుడు మా మేనేజరు బుర్ర బద్దలు కొట్టేస్తాను.

పిచ్చివాడ్ని కదా! కేసుండదు.

మహా అయితే పిచ్చాసుపత్రిలో పడేస్తారు.

పొద్దున ఎప్పుడో వేసుకున్న నాలుగు మెతుకులు. ఇంతవరకు అర కప్పు కాఫీ కూడా తాగలేదు. తీసుకొచ్చిన నీళ్లు ఎప్పుడో అయిపోయేయి.

టాక్సీలో పెట్రోలు అయిపోతోందే తప్ప ఆ కృష్ణమూర్తి దర్శనం మాత్రం అవలేదు.

అసలా ఊరు ఈ జిల్లాలోనే ఉందా?

పొరపాటున పొరుగు జిల్లా వాడికి అప్పు ఇవ్వలేదు కదా!

ఏమో! ఎనీథింగ్ ఈజ్ పాజిబుల్.

ఎప్పుడైనా దక్షిణ మరిచిపోయినా పూజారి ప్రసాదం ఇస్తాడేమో కాని, మా బాస్ మాత్రం నోటు పెట్టకపోతే 'నోట్' కదపడు. అది అతని వ్రతం. ఎప్పుడూ వ్రత భంగం చెయ్యడు మరి.

వేలు పుచ్చుకోవటం - లక్షలిచ్చీడం

లక్షలు పుచ్చుకోవటం - కోట్లు ఇచ్చీడం.

ఆఖర్న నువ్విన్ని లక్షలు వసూలు చెయ్యి, నువ్విన్ని కోట్లు వసూలు చెయ్యి అని మమ్మల్ని తోలడం.

అందుకే ఈ ఫైనాన్షియల్ సంస్థలన్నీ ఇలా తగలబడ్డాయి. ఎడ్రసులేని వాడికి కట్టలిచ్చేస్తే ఏమౌతుంది?

ఏవుంది? ఆగిపోతుంది.

ఆగిపోయింది.

ఫైనాన్షియల్ సంస్థ కాదు. మా టాక్సీ.

డ్రైవరు దిగి బానెట్ ఎత్తేడు. ఇంజన్లోంచి ఇల్లు తగలబడిపోతున్నట్టు పొగలు వచ్చేస్తున్నాయి.

"ఇంజను వేడెక్కిపోయింది సార్. రేడియేటర్లో నీళ్లు పొయ్యాలి" అని ఓ ఖాళీ డబ్బా పట్టుకొని బైల్దేరేడు. నేనూ, నా కొలీగ్స్ కూడా దిగేం.

చుట్టూ కొండలు.

రాళ్లు, గుట్టలు అన్నీ క్షవరం చేసినట్టు నున్నగా ఉన్నాయి. చెట్టు కాదు కదా ఎక్కడా గడ్డిపరక్కూడా లేదు.

ఇక్కడ నీళ్లెక్కడ దొరుకుతాయి?

తండ్రీ! కృష్ణమూర్తీ! ఏఁవిఁటయ్యా మాకీ పరీక్ష! ఈ ఉద్యోగం చెయ్యడమే మేము చేసిన పాపవాఁ??

అలనాడు గజేంద్రుడ్ని రక్షించడానికి విష్ణుమూర్తి "తన వెంటన్ సిరి..." వగైరాలు రాగా బైల్దేరేడు.

అలాగే నీళ్లవేటకి ముందు డబ్బాతో డ్రైవరు, వెనక మేము బైల్దేరేం.

జోళ్లున్నా ఆ వేడికి కాళ్లు కాలిపోతున్నాయి.

నడవగా...నడవగా...డవగా...వగా...దూరంగా ఒకమ్మాయి ఎండు పుల్లలు ఏరుకుంటూ కనిపించింది.

ఇంత ఎండలో...ఎవరూ లేని చోట...ఒకమ్మాయి...దెయ్యం కాదు కదా...భయపడ్డాడు మా కొలీగ్ కామేశం. అతనికి విపరీతమైన దెయ్యం భయం.

'ఛ! ఇంత ఎండలో దెయ్యమేమిటి?' విసుక్కున్నాడు విశ్వనాథం.

"దెయ్యానికి ఎండేమిటి?" గొణిగేడు కామేశం.

చుట్టూ ఎక్కడా చెట్టులేకపోయినా, అప్పుడే చిగిర్చిన చింత చెట్టులా ఉందా అమ్మాయి.

ఆకు ఆకుకీ మొగ్గ తొడిగిన మల్లెపందిరిలా ఉంది.

"చూడమ్మా..." నేనే పలకరించేను. చూసింది ఎవరీ ముష్కరులన్నట్టు.

"ఇక్కడెక్కడైనా నీళ్లు దొరుకుతాయా?" వాక్యం పూర్తిచేశాను.

నేనేదో అడక్కూడనిది అడిగినట్టు ముందు తెల్లబోయింది.

"నీళ్లమ్మా...నీళ్లు" గట్టిగా అడిగేను.

"ఓహో" అన్నట్టు తలాడించి "అల్లదుగో. ఆడ బావి ఉంది" అంది దూరంగా చూపిస్తూ.

మళ్లీ నడక.

వెళ్లగా, వెళ్లగా...ళ్లగా...గా...ఒక చిన్న గట్టులాంటిది కనిపించింది.

లోపలికి తొంగి చూశాం. చీకటి.

ఏదైనా సొరంగ మార్గమా? చుట్టు పక్కల ఎక్కడా శిథిలమైపోయిన కోట ఆనవాళ్లు ఏం లేవు. అంచేత ఇది సొరంగం కాదు. బావి అయి ఉండాలి.

నీళ్లున్నాయో లేదో?

డ్రైవరుకి కాకి, కూజా కథ జ్ఞాపకం వచ్చినట్టుంది.

రెండు రాళ్లు విసిరేడు.

నీటి శబ్దం వినిపించింది.

కాకి కథలోలాగ నీళ్లుపైకి వచ్చే వరకు అలా రాళ్లు విసరడమేనా? తోడడానికేదైనా ఉందా?

బావి చుట్టూ ప్రదక్షిణం చేసేం.

థేంక్ గాడ్!

ఒక తుప్పు పట్టిన బకెట్, పది మైళ్ల తాడు కనిపించేయి. బకెట్ కి అడుగున చిన్న కన్నం ఉంది.

ముగ్గురం కలిసి ఆ పది మైళ్ల తాడులాగగా, లాగగా కారినవి కారగా, అరగ్లాసు నీళ్లు మిగుల్తున్నాయి.

మొత్తానికి ఎలాగైతేనేం అరగంట తోడగా డబ్బా నిండింది. ఆ డబ్బాడు నీళ్లు దాహం పుచ్చుకున్న కారు కదిలింది.

మళ్లీ ఆ అమ్మాయి దగ్గరకే వెళ్లి ఫలానా ఊరు ఎక్కడుందని అడిగేను.

దూరంగా లక్కపిడతల్లా కనిపించే పాకలు చూపించింది.

సరే మళ్లీ బైల్దేరేం.

తోవలో ఒకపాడు పడిన ఇల్లులాంటిది కనిపించింది. దిగి చూశాం. తలుపులు, ద్వారాలు లేవు. టాపు కూడా లేదు. లోపల గోడ మూలని

ఒక చిన్న కుక్కపిల్ల నిద్రపోతోంది. చప్పుడుకి ఒక కన్ను మాత్రం విప్పి 'మీరా! ఎవరో అనుకున్నాను' అన్నట్టు చూసి మళ్లీ కన్ను మూసేసుకుంది. కిటికీ మీద కూర్చున్న ఉడత పిల్ల మాత్రం మమ్మల్ని చూసి ఛంగున గెంతేసింది. నేలని ఒక మూలపడున్న ఒక చెక్క ముక్కను తీసిన కామేశం 'యురేకా!' అని గావుకేక పెట్టేడు.

సీతాదేవిని వెతుక్కుంటూ వెళ్లిన శ్రీరాముడికి సుగ్రీవుడు కనిపించి సీత నగలు చూపించినప్పుడు రాముడికి కలిగిన ఆనందమే మాకూ కలిగింది.

హమ్మయ్య. మనక్కావల్సిన ఆసామీ ఈ చుట్టుపక్కలే ఉన్నాడు. కొంచెం హుషారొచ్చింది. పాకల దగ్గరకి వెళ్లాం. అక్కడక్కడ ఒకటి రెండు పెంకుటిళ్లు ఉన్నాయి. పాకలవతల కొండ. ఆ కొండమీద మాత్రం అక్కడక్కడ మొక్కలున్నాయి.

ఆ కొండమీద మేస్తున్న అవులు, గేదెలు, మేకలు ఎవరో దేవతలు పెట్టిన చుక్కల ముగ్గుల్లా ఉన్నాయి. పాకలకి కొంచెం దూరంలో అమ్మవారి గుడి ఉంది. దాని చుట్టూ పసుపు, కుంకుం రాసిన ఆనవాళ్లున్నాయి కాబట్టి అది గుడి అనుకోవాలి కాని లేకపోతే ఎవరిదో సగం కట్టి వదిలేసిన సమాధిలా ఉంది.

ఎండకి వేడెక్కిపోయిన బుర్రమీద వెన్నపెడితే నెయ్యి అయిపోతుంది.

పాలు పెడితే పెరుగు అయిపోతాయి.

'పోదాం సార్. బతికుంటే మరోనాడు వద్దాం' అన్నాడు విశ్వనాథం. అతని గుండె గొంతుకలో కొట్టుకుంటోంది.

ఔను. ఎవరీ కృష్ణమూర్తి?

ఏవాఁకథ?

ఆ కథాక్రమం బెట్టిదన -

ఈ మధ్య చదువులెక్కువైపోయేయి. ఉద్యోగాల్లేవు. పనీపాటా లేని జనం పిల్లల్ని కనేస్తున్నారు. దాంతో జనాభా పెరిగిపోతోంది. దేన్నీ అదుపులో పెట్టలేకపోతున్నారు.

నిరుద్యోగులు ఆటంబాంబు కంటే ప్రమాదమైన వాళ్లు.

ఏం చెయ్యాలో తోచని ప్రభుత్వం తల్లడిల్లిపోయింది. అలా తల్లడిల్లగా,

తల్లడిల్లగా ఒక ఉపాయం తోచింది. అదే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీము.

"బాబ్బాబు, మమ్మల్ని ఉద్యోగాలడక్కండి. అప్పులిస్తాం. ఆడవాళ్ళకైతే కొంత సబ్సిడీ ఇస్తాం. వడ్డీ తగ్గిస్తాం. చక్కగా వ్యాపారం చేసుకోండి" అంది.

ఇదేదో బావుందనిపించింది చాలా మందికి. లాభసాటిగా అనిపించింది వ్యాపారస్తులకి. ఇంకేం? తల్లి పేర, చెల్లిపేర, పని మనిషి పేర, అందరి పేర్లతో అప్పులు ఎడాపెడా తీసేసుకున్నారు. అయితే అప్పు తీర్చాలంటే మనసొప్పలేదు.

ఎలా? డబ్బు పారేసి, పెద్ద బుర్రల చేత ఫోన్లు చేయించేరు. ఫోన్లో సలాం కొట్టిన మేనేజరు మామీద దండెత్తి, పోయి డబ్బు వసూలు చేసుకొని రమ్మని మమ్మల్ని తోలడం. ఇది రివాజైపోయింది. ఇదిగో మేమిలా కాకుల్లా ఎండన పడి తిరగటం. ఇదీ తతంగం. ఈ తతంగంలో భాగమే ఈ కృష్ణమూర్తి వేట.

ఇందాకటి అమ్మాయి పుల్లల మోపు నెత్తిన పెట్టుకొని వెళ్తోంది.

"ఫలానా కృష్ణమూర్తి ఇల్లు తెలుసా?" అనడిగేం.

అదేదో జోకులాగా పగలబడి నవ్వింది.

ఎండకి మండిపోతున్న మా మొహాల మీద మల్లెపూల వాన పడినట్టుంది ఆ నవ్వు.

మండుటెండలో మలయమారుతంలా ఉందా నవ్వు.

"ఆడా! కిట్టప్పగాడా! అల్లదుగో. ఆ కొండ మీదున్నాడు" అంది నవ్వు ఆపి.

"అక్కడేం చేస్తున్నాడు?"

"బాగుంది. ఏటిసేస్తాడు? మేకలు కాస్తాడు."

"పీకలు కొయ్యడా?" కసిరేడు విశ్వనాథం.

"ఏటి బాబూ?" అందామ్మాయి.

"ఏం లేదులే. అతని ఇల్లు ఎక్కడుంది?" అడిగేను.

"అదిగో ఆ పాకల్లో అడగండి" అంది వెళ్లిపోతూ.

అలనాడు ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు గోవుల్ని కాస్తే, ఈ యుగంలో ఈ కృష్ణుడు మేకల్ని కాస్తున్నాడు.

హే! కృష్ణ పరమాత్మా! ఏఁమిటయ్యా నీ లీలలు!?
సారీ స్క్రీన్ ప్రింటింగ్ కని అప్పు తీసుకోవటమేమిటి?
ఈ మేకలు కాయటమేమిటి?
ఏమిటో తెలుసుకోవడానికి పాకల దగ్గరికి వెళ్లేం. ఎక్కడా నర సంచారం లేదు.
అన్ని ఇళ్ల తలుపులూ తీసే ఉన్నాయి.
ఒక పాక ముందు నిల్చుని "ఎవరండీ లోపల" పిల్చేను.
రెండు నిమషాలు నిశ్శబ్దం.
మూడో నిమషంలో 'నేను' అంటూ ఒక పెద్దకోడి లోపల్నుండి ఛంగున మా నెత్తిమీద నుండి గెంతి పారిపోవటం, కామేశం కెవ్వుమనడం ఒక్కసారే జరిగేయి.
"అదేవిఁటండీ బాబూ! అదేఁవిటి కోడా? కుక్కా? అంతుందేమిటి?" విశ్వనాథం విస్తుపోయాడు.
"హైబ్రిడ్ వెరైటీ అయుంటుంది" మళ్లీ అతనే అన్నాడు.
మరింక ఏ ఇంట్లో ఏం గెంతుతుందోనని ఎక్కడా అడగలేదు. చివర పాక ముందు అరుగు మీద ఒక ముసలమ్మ పడుకుంది.
ఈవిడ్ని లేపితే ఏం తిడుతుందో?
కాని అదృష్టం. ఆవిడే లేచి "ఎవరు బాబూ?" అంది.
"కిట్టప్ప ఇల్లు ఇదేనా అమ్మా?" అడిగేను.
"నాకొడుకే బాబూ. ఏటి సేసేడు బాబూ?" ఆత్రంగా అడిగింది.
"ఏం లేదులే. రేపొకసారి పట్నంలో మా ఆఫీసుకి వచ్చి కలియమను" అన్నాడు కామేశం.
"ఆడికేటీ తెల్దుబాబూ. మేకల్లో మేకలాటోడు" అంది ఏడుపు గొంతుకతో.
"ఏం లేదు. ఓసారి రమ్మను" అని కారు దగ్గరకి వెళ్లాం.
రూల్సు ప్రకారం అప్పు తీర్చకపోతే వాడి యూనిట్ సీల్ చెయ్యాలి. వాడి ఆస్తి సీల్ చెయ్యాలి. వీడి ఆస్తి పాతిక మేకలు. వాటిని తీసికెళ్లాలా?!
కురుక్షేత్రంలో అర్జునుడికి శ్రీకృష్ణుడికి విశ్వరూప దర్శనం అయినట్టు. మర్నాడు పొద్దున్నే మాకు ఈ కృష్ణుడి దర్శనం అయింది.

జన్మతరించింది.

"డబ్బు కట్టవేఁటయ్యా?" అడిగేం.

"డబ్బేటండి?" అన్నాడు.

"మరి అప్పుడు అన్ని లక్షలు పుచ్చుకున్నావు?" కసిరేడు కామేశం. అతను తొణకలేదు. బెదరలేదు!

అచ్చు మేకలాగే నవ్వేడు. (మేకలు నవ్వవు. కాని అతని నవ్వులో అమాయకత్వం మేకని గుర్తుచేస్తుంది. అంతే!)

"బావుందండి. నాను డబ్బు తీసుకోవటవేటండి? ఆ ఎంకటేశం బాబొచ్చి "ఒరే కిట్టప్పా! సర్కారోళ్లు నీలాటోళ్లందరికీ మేకలు ఊరికే ఇస్తున్నారు. సంతకం ఎట్టు" అన్నాడండి. నాకేటి ఎరికండి? ఎట్టేసినానండి. అంతే!"అన్నాడు.

"నీకు సంతకం పెట్టడం కూడా వచ్చునా కృష్ణావతారం?" విశ్వనాథం విసుక్కున్నాడు.

"ఆ బాబే నేర్పినాడండి."

"ఏడీవాడు?"

"నాకేటి ఎరికండి?"

అదీ.

ముల్లుకి కత్తి వచ్చె ఢాం ఢాం అని పిచిక కథలాగ మూడు లక్షలకి ముప్పై మేకలు వచ్చేయి ఢాం ఢాం అని డప్పుకొట్టుకుంటూ మర్నాడు మరో అప్పు వసూలుకి బైల్దేరేం.

ఈసారి ఏ పందులవాడు తగుల్తాడో!

ఏ గేదెల వాడు తగుల్తాడో!

"పొగతాగని వాడు దున్నపోతైపుట్టున్" అన్నది గిరీశం నాటి మాట.

"లంచం తీసుకోని వాడు అడ్డగాడిదై పుట్టున్" అన్నది ఈనాటి మాట.

అందుకేనేమో "కరప్షన్ ఈజ్ గ్లోబల్ ఫినామినా" అన్నాది ఇందిరాగాంధీ!

*("ఆంధ్రప్రభ" వారపత్రిక 26 జూన్, 1996)*

★ ★ ★